క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

విస్సన్నపేట: మండలంలోని కలగర సచివాలయం పరిధిలో కలగర, రామచంద్రాపురం, తండా గ్రామాల్లో శనివారం, ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తారు. స్థానిక సమస్యలు తెలసుకుంటారు. ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పాల్గొనాలన్నారు.

11న ఉచిత వైద్యశిబిరం

తిరువూరు: ఈ నెల 11న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తిరువూరు వైష్ణవి హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. సాధారణ వ్యాధులతో పాటు ఎముకలు, నరాల బలహీనత రోగులు ఉచిత వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తామని తెలిపారు. వివరాలకు 7337023619 నంబరులో సంప్రదించాలని కోరారు.

మిల్క్ టెస్టర్లు ప్రారంభం

తిరువూరు: స్థానిక లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో పాల నాణ్యత పరీక్షించే ఆధునిక నానో మిల్క్ టెస్టర్లను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. త్వరితగతిన పాల నాణ్యతను నిర్ధారించే ఈ యంత్రాలను రైతుల ప్రయోజనార్థం ఏర్పాటు చేసినట్లు చైర్మన్ తెలిపారు. యూనియన్ పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు, పల్నాటి సత్యనారాయణ, లక్ష్మీపురం పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వోకు మెమో

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారి (సీహెచ్‌వో) కేవీఎస్ నారాయణకు పీహెచ్‌సీ వైద్యులు సుధాప్రసూజ శుక్రవారం మెమో జారీ చేశారు. విధి నిర్వాహణలో బాధ్యత లేకుండా నిర్లక్ష్యం వహించి ఉన్నతాధికారుల పర్యటనకు హాజరు కాకపోవడంపై సంజాయిషీ కోరామని డాక్టర్ తెలిపారు. ఈనెల 30న జూపూడిలో కేంద్ర బృందం, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పర్యటించారు. అసమయంలో జూపూడి వెల్‌నెస్ సెంటర్‌లో ఉండాల్సిన సీహెచ్‌వో నందిగామలో ప్రభుత్వ వ్యతిరేక ధర్నాలో పాల్గొన్నట్లు గుర్తించారు. అక్కడ ఉండాల్సిన సీహెచ్‌వో గైర్హాజరుపై ఎంపీడీవో అధికారులకు వివరణ ఇవ్వాల్సి వచ్చింది. విధులకు హాజరు కాకపోవడంపై మెమో ద్వారా వివరణ కోరారు.

7న ఆలయంలో షాపుల వేలం

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానానికి చెందిన 1, 2, 3 నంబర్ల దుకాణాల్లో పూజాద్రవ్యాల వ్యాపారం చేసికొనే అద్దె హక్కునకు, పాల పొంగళ్లకు గ్యాస్ పొయ్యిలు అద్దెకిచ్చే హక్కునకు ఈ నెల 7వ తేదీన టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వై.సీతారామయ్య శుక్రవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల మండలి సమక్షంలో టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహింహిస్తామన్నారు. ఆసక్తిగల వారు 5వ తేదీ సాయంత్రం 5 గంటలోగా ఆలయ పనివేలల్లో సంప్రదించాలన్నారు.

రేపు సహకార ఉద్యోగుల సంఘ సమావేశం

నూజివీడు: సహకార ఉద్యోగుల సంఘ సమావేశాన్ని ఆదివారం విజయవాడలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. నగరంలోని లెనిన్ సెంటర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న ఈ సమావేశంలో 2022 సహకార సంఘాల చట్ట సవరణలు, అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లోని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎండలకు బెంబేలు

చాట్రాయి: రోహిణీ కార్తె ఎండలకు ప్రజలు బెంబేలెత్తున్నారు. ఉదయం 9 గంటలకే సూర్యుడు భగభగమంటున్నాడు. తీవ్రమైన ఉష్ణోగ్రతలకు ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. అత్యవసర పనులున్నవారు మాత్రమే బయటకొస్తున్నారు. శీతల పానియాలైన కొబ్బరి, పుచ్చకాయలు, తాటి ముంజలు హాట్ కేకుల్లా అమ్ముడు పోతున్నాయి. ఎండలకు గృహాల్లో, షాపుల్లో ఫ్యాన్లు, ఏసీలు వాడుతుండడంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. వాహనచోదకులు ముఖానికి వేడి తగలకుండా వస్త్రాలు ధరిస్తున్నారు. ఉదయం 10 గంటలకే బయట పనులు ముగించుకుని ఇళ్లకు చేరుతున్నారు.

రేపు ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమం

ఉద్యోగులు భాగస్వాములు కావాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపునకు ఆదివారం నిర్వహించే కార్యక్రమంలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్ ఎండీ ఇక్బాల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కొండపల్లి ఖిల్లా ఘాట్ రోడ్డు, అటవీ ప్రాంతంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా ఐఎఫ్ఎస్ అధికారులు పీవీ చలపతిరావు, ఎన్.శరవణన్ పాల్గొంటారు. ప్రభుత్వ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, ట్రెక్కింగ్ క్లబ్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమానికి అవిరళ కృషి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రక్షణనిధి
- గంపలగూడెంలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.31.25 కోట్లు ఖర్చు


గంపలగూడెంలో మహిళను సమస్యలు అడిగి తెలుసుకొంటున్న ఎమ్మెల్యే రక్షణనిధి

గంపలగూడెం: గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమానికి అవిరళ కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి పేర్కొన్నారు. గంపలగూడెంలో గడిచిన నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద రూ.31.25కోట్లు ఖర్చుచేశామన్నారు. గంపలగూడెం పట్టణ పరిధిలో తాగునీటి సౌకర్యం మరింత మెరుగుపరిచేందుకు రూ.30 లక్షలు గ్రామ సచివాలయం నిధులు కేటాయిస్తున్నట్లు రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం-2 గ్రామ సచివాలయంలో గడప గడకు మన ప్రభుత్వం ముగింపు సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో రెండు సచివాలయాలు ఉండగా ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించిందన్నారు. మొత్తం రూ.40 లక్షల్లో రూ.30 లక్షలతో పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కారం కోసం కేటాయించగా, మిగిలిని రూ.10 లక్షలు సిమెంట్ రోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్య పరిష్కారం కోసం కేటాయించినట్లు చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా 6,630 మంది లబ్ధిదార్లను ఎంపిక చేసి రూ.28.31 కోట్లను నేరుగా బ్యాంక్ అకౌంటుల్లో జమ చేశామన్నారు. అభివృద్ధి పథకాల కింద రూ.2.94 కోట్లు ఖర్చుచేసినట్లు తెలిపారు. ఆరు రోజులపాటు రెండు సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు చేపడతానన్నారు. కాలనీ గృహాలు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. ఆఖరి రోజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. బుక్‌లెట్లను అందజేశారు. ఎంపీపీ గోగుమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరశింహారావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జీ చెన్నకేశవరెడ్డి, సీహెచ్ నర్సారెడ్డి, కొత్తగుండ్ల వంశీ, మాజీ ఎంపీపీ కోట దాసు, సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లు కృష్ణారెడ్డి, నాయకులు పెదగవళ్ళ హరికృష్ణ, మాగంటి వెంకటకృష్ణ, కోట రవి, దోర్నాల రాము, సువారపు చంద్రశేఖర్, అచ్చియ్య, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఈఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

రూ.10 వేలు సాయం చేసిన సచివాలయ సిబ్బంది


చింతలనర్వలో దగ్ధమైన ఇల్లు

చింతలనర్వ(గంపలగూడెం): విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన సంఘటన శుక్రవారం గంపలగూడెం మండలం చింతలనర్వలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాయవరపు స్వామి ఇల్లు ఘటనలో బుగ్గిపాలైంది. ఇంట్లో సామాన్లు, రూ.50 వేల నగదు కాలిపోయాయి. తిరువూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు. రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. వీఆర్వో మూర్తి కాలిన ఇంటిని పరిశీలించి తహసీల్దార్ కార్యాలయంలో నివేదిక అందజేశారు. చింతలనర్వ సచివాలయం సిబ్బంది తమ వంతు సాయంగా రూ.10 వేలను బాధితునికి అందజేశారు.

నేడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

మేడూరు(గంపలగూడెం): మండలంలోని మేడూరులో పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం ఉదయం 8.24 గంటలకు శంకుస్థాపన చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వ రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాతల విరాళంతో ఇప్పటికే దిగువ నుంచి కొండపైకి ఎక్కేందుకు 299 మెట్ల నిర్మాణం పూర్తి చేశామని వెంకటేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నందిగామ: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం పెనుగంచిప్రోలు చెందిన నలుగురు ఆటోలో నందిగామ కు వస్తున్నారు. 65వ నెంబర్ జాతీయ రహదారిపై పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఎదురుగా వస్తున్న బస్సు ఆటోలు ఢీకొన్నాయి. ఘటనలో ఆటో ప్రయాణికులు నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ హరీష్ తెలిపారు.

వృద్ధుడి మృతి

కంచికచర్ల: ఓ వృద్ధుడు ఎండ తీవ్రతకు తట్టుకోలేక మృతి చెందిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా మధిర మండలం మడుపల్లి గ్రామానికి చెదిన గౌరవరపు సీతారాములు(65) ఈ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. భిక్షాటన చేసిన అనంతరం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మేరీమాత విగ్రహం వెనుక ఉన్న డ్రైనేజీ బండపై కూర్చుని ఎండ తీవ్రతను తట్టుకోలేక మృతి చెందాడని స్థానికులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నేటి నుంచి చంద్రశేఖరస్వామి ఆలయ ప్రతిష్టా ఉత్సవాలు

గన్నవరం రూరల్: పురుషోత్తపట్నంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయ పునః ప్రతిష్టా ఉత్సవాలు ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకూ జరుగుతాయని శివకేశవ ఆలయ అభివృద్ధి కమిటీ శుక్రవారం తెలిపింది. శనివారం ఉదయం గోపూజతో ప్రారంభమై 7వ తేదీ బుధవారం శాంతికల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయని, అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

బడుగుజీవుల ఆశాజ్యోతి

కన్నెవీడు(వత్సవాయి):బడుగుజీవుల ఆశాజ్యోతి రాజ్యాంగనిర్మాత బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని బాబు జగజ్జీవన్‌రావ్ అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం గ్రామంలో అంబేడ్కర్ సాధన సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్, జగ్జీవన్‌రాం చూపిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చావా దుర్గారాణి, ఎంపీటీసీ సభ్యురాలు లావుడియా లక్ష్మీ మగతానాయక్, మక్కపేట సర్పంచ్ గుడేటి శారమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర ప్రకారమే ఆలయ నిర్మాణాలు

దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప


సూచనలు చేస్తున్న దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప, చిత్రంలో ఈఓ, చైర్మన్

పెనుగంచిప్రోలు: ఆలయ నిర్మాణాలు శాస్త్ర ప్రకారం జరగాలని రాష్ట్ర దేవదాయ శాఖ స్థపతి పి.పరమేశ్వరప్ప అన్నారు. శుక్రవారం ఆయన గ్రామంలోని శ్రీతిరుపతమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు ఆయనకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఉపాలయం అంకమ్మ ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేయడంతో పాటు, మెరుగైన దర్శనం చేసుకునేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కేశఖండనశాల, టాయిలెట్ బ్లాక్, వార్షిక కల్యాణ స్థలంతో పాటు ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద స్వాగత ద్వారం ఏర్పాటుకు సంబంధించి పరిశీలన చేశారు. ఆలయం ముందు రేకుల్ షెడ్ వేయడంతో గోపురాలు కనిపించటం లేదని, గాలి రాకుండా మూసేసిందని వెంటనే తీయాలని ఆలయ అధికారులకు సూచించారు. ఆలయం పక్కన షాపింగ్ కాంప్లెక్స్ మాదిరి దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఇరుగ్గా ఉందని వాటిని బయట ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో డ్యాన్స్‌మాస్టర్



పెనుగంచిప్రోలు: గ్రామంలోని తిరుపతమ్మను శుక్రవారం సినీ డాన్స్‌మాస్టర్ శేఖర్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిరంజీవి సినిమా భోళాశంకర్, మహేష్‌బాబు సినిమా గుంటూరు కారంతో పాటు రవితేజ, బాలకృష్ణ సినిమాల్లో పాటలకు నృత్యదర్శకత్వం చేస్తున్నానన్నారు. అమ్మవారు మహాశక్తి కలగిన వారన్నారు. గతంలో పలుమార్లు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నానని చెప్పారు.

భక్తుల రద్దీ..

గ్రామంలోని శ్రీతిరుపతమ్మ దర్శనానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు, శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. తెలంగాణ నుంచి కూడా వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది.

రోగులు, సహాయకులకు ఉచిత భోజనం


ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పాత ప్రభుత్వాస్పత్రికి నిత్యం వందలాది మంది ఓపీ రోగులు వస్తుంటారు. ప్రసవం కోసం వచ్చిన గర్భిణుల కుటుంబ సభ్యులు సైతం పెద్ద సంఖ్యలో బయట వేచి ఉంటారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చేది ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వాళ్లే ఉంటారు. ఇన్‌పేషెంట్స్‌కు ఆస్పత్రిలోనే భోజనం పెట్టినప్పటికీ, వారి వద్ద ఉండే సహాయకులు, బయట వేచి ఉన్న వారు భోజనానికి కొంత ఇబ్బంది పడాల్సి ఉంటుంది. అలాంటి వారి కోసం అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫుడ్ క్యాబిన్ ఏర్పాటు చేసి ఉచిత భోజన పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం మాజీ మంత్రి వెస్ట్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. ప్రతిరోజూ ఇంటి తరహా భోజనం అందించడంతో పాటు, చల్లని మంచినీరు ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆకలి, దాహార్తిని తీర్చడం చాలా మంచి పరిణామం అన్నారు. అన్న సంతర్పణ సమితి సేవలు మరింత విస్తరింపచేయాలని ఆకాంక్షించారు. కాగా క్యాబిన్ ఏర్పాటుకు సహకరించిన పువ్వాడ కుశనాథ్ గుప్తాను అన్న సంతర్పణ సమితి కార్యదర్శి పీఎస్ఆర్ మూర్తి అభినందించారు. కార్యక్రమంలో పలువురు సమితి సభ్యులు పాల్గొన్నారు. తొలిరోజు 250 మందికి ఉచిత భోజన పంపిణీ జరిగింది. ప్రతిరోజూ 200 నుంచి 250 మందికి పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ స్వరాజ్య మైదానంలో ఎంతో అద్భుతంగా జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నిర్మాణ పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులకు సూచించారు. గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్‌స్కేప్, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. విగ్రహానికి సంబంధించిన అన్ని విడి భాగాలను కలిపి అత్యంత జాగ్రత్తగా పూర్తి చేయాలని కోరారు. ఇది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అద్భుతమైన ప్రాజెక్ట్ అన్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా చేయాలని సూచించారు. ప్రధాన విగ్రహంతోపాటు మిగిలిన పనులూ అనుకున్న సమయంలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

హాయిగా నవ్వుకునేలా అన్‌స్టాపబుల్ సినిమా



లబ్బీపేట(విజయవాడ తూర్పు): కుటుంబంతో సహా థియేటర్‌కి వచ్చి హాయిగా నవ్వుకునేలా 'అన్‌స్టాపబుల్' ఉంటుందని ఆ సినిమా హీరో వీజే సన్నీ అన్నారు. బిగ్‌బాస్ విన్నర్ వీజే సన్నీ హీరోగా నటించిన అన్‌స్టాపబుల్ సినిమా ఈ నెల 9న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర యూనిట్ సభ్యు లు శుక్రవారం నగరానికి విచ్చేశారు. అందులో భాగంగా పీవీపీ మాల్‌లో అభిమానులను కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా వీజే సన్నీ మాట్లాడుతూ రత్నబాబు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో నక్షత్ర, అక్సాఖాన్‌లు హీరోయిన్లుగా న టించినట్లు తెలిపారు. ఎ2బి ఇండియా ప్రొడక్షన్స్‌లో రంజిత్‌రావు నిర్మాతగా హైదరాబాద్, నిజామాబాద్, గోవా వంటి ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరిగినట్లు పేర్కొన్నారు. ఈ సినిమాకు సంబంధించి పోస్టర్లు, టీజర్‌ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయన్నారు. హాస్యం కోరుకునే ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని ఈ చిత్రాన్ని డైరెక్టర్ చాలా చక్కగా తీశారని తెలిపారు. దర్శకులు రత్నబాబు, నిర్మాత రంజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

సిబ్బందికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశం


పొందుగలలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

పొందుగల(మైలవరం): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. మైలవరం మండలం పొందుగల గ్రామాన్ని కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం సందర్శించారు. గ్రామంలో పర్యటించి శానిటేషన్, తాగునీటి వసతులను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 6న జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ పర్యటన ప్రత్యేకత సంతరించుకుంది. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ గ్రామంలో శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు చేపడుతూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జ్వరాలు ప్రబల కుండా పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులు, వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకుమారి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, సర్పంచ్ కోటమ్మ, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న శిక్షణ


పెనుగొలనులో స్వాతంత్య్ర సమరయోధుల చిత్ర పటాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రెడ్డిగూడెం: స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత చరిత్ర పుస్తకం చదివించారు. నీతి కథలు పుస్తకాలు చదివించారు. ఎస్.శ్రావణి గ్రంథాలయంలో విద్యార్థులకు ఆహార విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత విషయాలను వివరించారు. అనంతరం అటలు, కాగిత రాకెట్లను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆటలు అడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రంథాలయాల్లో సమ్మర్ కోచింగ్‌కి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు రకాలు పుస్తకాల పఠనం, చిత్రలేఖనం లాంటివి నిర్వహిస్తున్నారు. తోటి విద్యార్థులతో చిన్న చిన్న కథలు చెప్పిస్తుండడంతో విద్యార్థులు సమ్మర్ కోచింగ్‌కి తరలివస్తున్నారు. శుక్రవారం నీతి కథలు వినిపించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు శ్రీకాంత్, మణికంఠలు పాల్గొన్నారు.

గంపలగూడెం: పెనుగొలను శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో శుక్రవారం కథలు చదివించారు. అలీబాబా 40 దొంగలు, అనగనగా ఒక రాజు కథలును విద్యార్థులు చదివారు. అనంతరం షిరిడి సాయి సేవ సమితి ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమర యోధుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతి జరిపారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. గోపాలకృష్ణయ్య జీవిత విశేషాలను సేవా సమితి సభ్యులు నారాయణరావు వివరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన స్వాతంత్ర సమరయోధుల చిత్ర పటాల ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకున్నాయి. బాల బాలికలకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహణ అధికారి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

అరచేతిలో వైకుంఠం చూపుతున్న చంద్రబాబు

ఏపీ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సలహాదారు నాగార్జునరెడ్డి


తిరుమలగిరిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాగార్జున రెడ్డి


చిల్లకల్లు ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం

జగ్గయ్యపేట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అరచేతిలో వైకుంఠం చూపించే వ్యక్తని మోసపూర్తి హామీలివ్వటమే ఆయన నైజమని ఏపీ ప్రభుత్వ పంచాయతీ రాజ్ గ్రామాభివృద్ధి శాఖ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి విమర్శించారు. మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం ఆయన పర్యటించారు. తిరుమలగిరిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన, జగనన్న కాలనీ, రైతు భరోసా కేంద్రం, ముక్త్యాలలో గ్రామ సచివాలయం, జగనన్న కాలనీలలో నిర్వహించిన గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. షేర్‌మహ్మద్‌పేటలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంట పొలాలు, అమృత సరోవర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. అనంతరం చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలను మోసపూరిత హామీలతో చంద్రబాబు నట్టేట ముంచారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నారని చెప్పారు. కడప ఎంపీ అవినాష్‌రెడ్డిపై ఎల్లో మీడియా గ్లోబల్ ప్రచారం చేస్తోందనితెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ రాజమండ్రిలో చంద్రబాబు ఏర్పాటు చేసిన మహానాడులో ఎన్నికల మేనిఫెస్టో అంటూ ఇచ్చిన హామీలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఆల్ ఫ్రీ బాబు అనేది రాజశేఖర్‌రెడ్డి సాక్షాతూఅసెంబ్లీలో వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలే అమలు చేయలేక చంద్రబాబు చతికిలబడ్డాడని ఇప్పుడు ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని ప్రజలు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు, ప్రత్యేకాధికారి బాలాజీ కుమార్, ఎంపీడీవో జయచంద్ర, తహసీల్దార్ నాగరాజు, పంచాయతీ రాజ్ డీఈ మురళి, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సొంతింటి కల నిజం చేస్తున్నారు

ముక్త్యాల(జగ్గయ్యపేట): నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల హృదయాలలో నిలిచిపోతారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో నవరత్నాలు-పేదలందరికి ఇళ్ల పథకంలో భాగంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో మార్క సతీష్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రకాశరావు, ఎంపీడీవో జయచంద్ర, ఈవోపీఆర్డీ సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నేతలు సయ్యద్ షాఉద్దీన్, దాది బ్రహ్మం, వెంకట నర్సయ్య, యంద్రాతి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంఘిక నాటికలు

విజయవాడ కల్చరల్: శ్రీహర్ష క్రియేషన్స్ అండ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ 5 వ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ సాంఘిక నాటికల పోటీలు రెండవ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం నాటి ప్రదర్శనలు మణికంఠా ఆర్ట్స్ పిఠాపురం వారు కొత్తతరం కొడుకు నాటికను ప్రదర్శించారు. మూలకథ రావూరి కృష్ణారావు, నాటకీకరణ దర్శకత్వం చెలికాని వెంకట్రావు. రెండవనాటికగా మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ చిలకలూరిపేటవారి మృత్యుపత్రం, మాతృశ్రీ కళానికేతన్ వారి పనికిరాని వాడు నాటికలను ప్రదర్శించారు. హర్షక్రియేషన్స్ అధ్యక్షుడు కత్తి శ్యాంప్రసాద్. ప్రధానకార్యదర్శి పిళ్ళా నటరాజ్, నిర్వాహక కార్యదర్శి మల్లేశ్వర పట్నాయక్, క్రియాశీలక సభ్యులు అమృతవర్షిణి, గుడివాడ లహరి, ప్రేమకుమారి వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు సుఖమంచి కోటేశ్వరరావు, పోలుదాసు రంగనాయకులు పాల్గొన్నారు.